సాక్షి
జగిత్యాల

శనివారం । 7 । అక్టోబర్ । 2023



డబుల్ ఇళ్లలో గందరగోళం

జగిత్యాల అర్బన్ ప్రాంతానికి కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఓ ఉద్యోగి చేతివాటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. 8లో▸



విధుల్లోకి అంగన్‌వాడీలు

తమ సమస్యలు పరిష్కరించాలని 24రోజుల పాటు సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు నేటినుంచి విధుల్లో చేరనున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం 32.0/24.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం పడే అవకాశం ఉంది. రాత్రిపూట చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న నారాయణ

కథలాపూర్(వేములవాడ): మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ సూచించారు. శుక్రవారం కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో మత్తు, మద్యం, సిగరేట్లు సేవించడంతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ విద్యార్థికి ఇంటర్ దశ కీలకమని, మంచి లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. కళాశాల ఆవరణలో పొగాకు, మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారులు సింధూజ, సురేందర్, రజిత, ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, సూపర్‌వైజర్ నాగభూషణ్ పాల్గొన్నారు.

నృసింహుని ఆదాయం రూ.39.69 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానం హుండీని శుక్రవారం లెక్కించారు. రూ.39,69,104 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 98 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నగదుతో పాటు 95గ్రాముల మిశ్రమ బంగారం, 5.100 కిలోల మిశ్రమ వెండి, 36 విదేశీనోట్లు సమకూరినట్లు తెలిపారు. దేవాదాయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, రెనోవేషన్ కమిటీ సభ్యులు రామన్న, పద్మ, రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధే ధ్యేయం



చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌గౌడ్

రాయికల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం కుమ్మరిపల్లి, చెర్లకొండాపూర్, రామాజీపేట గ్రామాల్లో బీటీరోడ్ల నిర్మాణానికి, మంక్యా నాయక్‌తండా, వస్తాపూర్ నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. గ్రామాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు స్వప్న, రాజ్యలక్ష్మీ, రమాదేవి, బంగారి, శ్రీనివాస్‌గౌడ్, సుమలత, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ముత్యంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు దొంతి నాగరాజు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చండి



ఆందోళన చేస్తున్న ఆరోగ్యమిత్ర సిబ్బంది

జగిత్యాల: ఆరోగ్య మిత్రలకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చాలని, దీనికి నిరసనగా ఈనెల 6,7,8 తేదీల్లో సేవలు బహిష్కరిస్తున్నట్లు ఆరోగ్యమిత్రలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆరోగ్య హెల్త్‌కేర్ ట్రస్ట్ ఎదుట జిల్లా నాయకులు ఆందోళన చేపట్టారు. క్యాడర్ మార్పు చేసి జీతం పెంచాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేరెల్ల సతీశ్, సల్లూరి రాజశేఖర్, కర్ల శ్రీనివాస్, దాసరి మురళీ, దుబ్బాక రాజేశ్, పందిరి శ్రీధర్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. కామర్స్‌లో 2, కంప్యూటర్స్‌లో 1, ఆంగ్లంలో 2, తెలుగు 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పీజీలో ఓసీ, బీసీ అభ్యర్థులకు 55, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. బోధన అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. అర్హులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, 11న 10 గంటలకు కళాశాలలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 98855 88419 సంప్రదించాలని తెలిపారు.

వైద్యసేవలు విస్తరిస్తాం

- కోరుట్ల అభ్యర్థి సంజయ్‌ని ఆశీర్వదించండి
- సీటీస్కాన్ మిషన్.. అదనంగా డయాలసిస్ బెడ్లు
- ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు



వంద పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు మరింత విస్తరిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కోరుట్లలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి మాట్లాడారు. కోరుట్ల పరిసర ప్రాంతాల జనం డయాలసిస్ కోసం హైదరాబాద్, కరీంనగర్ వంటి కేంద్రాలకు వెళ్లి పడుతున్న ఇబ్బందులు చూసి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరుట్ల ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారని గుర్తు చేశారు. ఆయన కోరిక మేరకు తొమ్మిది నెలల క్రితం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, అదనంగా మరో మూడు బెడ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సీటీ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు వెంటనే నిధులు ఇస్తామన్నారు. ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒకే డయాలసిస్ సెంటర్ ఉండేదని ప్రస్తుతం 13 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని ఈ సందర్భంగా వివరించారు.

నాడి తెలిసిన మనిషి

బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రజల నాడి తెలిసిన మంచి వైద్యుడని ప్రజాసేవ చేయాలనే తపనతో తండ్రి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బాటలో రాజకీయాల్లోకి వచ్చారని ఆయనను ఆశీర్వదించి కోరుట్లలో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలన్నారు. పదేళ్ల క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య 30నుంచి 70 శాతానికి పెరిగిందన్నారు.

ఊసరవెల్లి రేవంత్

టీడీపీలో ఉన్నప్పుడు ఓ రీతిలో మాట్లాడి ప్రస్తుతం కాంగ్రెస్‌లో మరోలా మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్ ఊసరవెల్లి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను



సభకు హాజరైన ప్రజలు

ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగిత్యాలలో మెడికల్ కాలేజీ, కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, త్వరలో మెట్‌పల్లిలోనూ వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు ఇవన్నీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కృషితోనే పూర్తి అయ్యాయని ఆయన గుర్తు చేశారు.

కొడుకును ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, మంత్రి హరీశ్‌రావు తన నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు ఉన్నా వెంటనే సహకరించి నిధులు ఇచ్చారన్నారు. వయోభారంతో తాను సంజయ్‌కు టికెట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరానని.. అయినప్పటికి చివరిశ్వాస వరకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానన్నారు. కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్



జర్నలిస్టుకాలనీ ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు తనను ఆశీర్వదించేందుకు కోరుట్లకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, కలెక్టర్ యాస్మిన్ బాషా, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్లు అన్నం లావణ్య, రానవేని సుజాత, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీ ప్రారంభం

కోరుట్లలో 35 జర్నలిస్టు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన క్రమంలో శుక్రవారం మంత్రి హరీశ్‌రావు జర్నలిస్టు ఇండ్ల ప్రారంభోత్సవ శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. జర్నలిస్టులందరికీ దశలవారీగా ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు.

కాంగ్రెస్‌లో కొత్త జోష్!



మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై ప్రతిపాదనలు స్వీకరిస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

- మేనిఫెస్టో కమిటీ భేటీతో ఉత్సాహం
- పసుపు–కుంకుమ, ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం
- ప్రకటనకు ముందే ఆశావహుల ప్రచారం మొదలు
- హుజూరాబాద్ బరిలో వొడితెల ప్రణవ్!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ నింపేందుకు అధిష్టానం నడుం బిగించింది. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశమైన వేళ.. పసుపు–కుంకుమ పథకం ప్రకటనతో పార్టీ హామీలు ప్రజల్లోకి మరింత లోతుగా చొచ్చుకెళ్తాయని కాంగ్రెస్ ధీమాగా ఉంది. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు తోడు తాజాగా ప్రకటించిన పసుపు–కుంకుమ పథకం ప్రతిపాదన కరీంనగర్‌లోనే పురుడు పోసుకోవడం, దానికి మేనిఫెస్టో కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలపడం నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. శుక్రవారం ఉదయం భేటీ అయిన మేనిఫెస్టో కమిటీ పలువురు నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితోపాటు కొందరు నాయకులు పసుపు–కుంకుమ పథకాన్ని ప్రతిపాదించారు. ఇప్పుడున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను కొనసాగిస్తూనే.. వధువుకు తులం బంగారంతో తాళిబొట్టు, వెండి మెట్టెలు కూడా అందజేయాలన్న ప్రతిపాదనను కమిటీ స్వాగతించింది. దీన్ని గాంధీభవన్‌లోని పార్టీ పెద్దలు, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఆమోదించుకునే పనిలో ఉన్నారు. వీటితోపాటు ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.2,500 సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.1,200, కౌలు రైతులకు ఏటా రూ.12 వేల సాయాన్ని జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని తీర్మానించారు.

ప్రణవ్ రాక సంచలనం



వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపింది. గులాబీ పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ఎంపీ రాజేశ్వరరావు కుటుంబ వారసత్వం, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, జీవీ రామకృష్ణారావులకు రక్త సంబంధీకుడు కావడంతో అన్ని పార్టీల్లోనూ ఆయన చేరిక చర్చనీయాంశంగా మారింది. సామాజికంగా, ఆర్థికంగా ప్రణవ్ రాక కాంగ్రెస్ పార్టీకి మేలు చేస్తుందని కేడర్ ధీమా వ్యక్తం చేస్తోంది.

మరో మానవీయ పథకానికి శ్రీకారం

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- గొల్లపల్లి మండలం చందోలిలో అల్పాహారం ప్రారంభం



చందోలిలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్‌నేత

గొల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి చదువుపై దృష్టి సారించేలా సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రారంభించి, మానవీయత చాటారని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని చందోలి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటేశ్‌నేతతో కలిసి అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 27,147 ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మందికి పైగా విద్యార్థులకు అల్పాహార పథకం ప్రయోజనం కలగనుందన్నారు. అనంతరం మండలంలోని దమ్మన్నపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాపల్లి నుంచి గోవిందుపల్లి వరకు రోడ్డు నిర్మాణంతో పాటు, రూ.17కోట్లతో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పీఏసీఎస్ చైర్మన్ రాజసుమన్‌రావు, వెంకటమాధవరావు, ఏఎంసీ చైర్మన్ కాంపల్లి హన్మండ్లు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

మన పథకాలు దేశంలో ఎక్కడా లేవు

వెల్గటూర్: రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్‌కు ఎదురులేదని, మన పథకాలు దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం సంకెనపెల్లిలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

, రాజారాంపల్లిలో రూ.2 కోట్లతో వివేకానంద కూడలి విస్తరణ పనులకు ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి శంకుస్థాపన చేశారు. చెర్లపల్లిలో 200మంది బీఆర్‌ఎస్‌లో చేరగా.. మంత్రి ఈశ్వర్ కండువా కప్పి ఆహ్వానించారు. వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎండపల్లి మండల అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలతో సస్యశ్యామలం

ధర్మపురి: ఎత్తిపోతల పథకాల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరందుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురితో పాటు రాయపట్నంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ వెంకటేశ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ధర్మపురిలో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. గోదావరి ఒడ్డున రూ.60.80కోట్లతో చేపడుతున్న అక్కపెల్లి చెరువు ఎత్తిపోతల పథకానికి, రాయపట్నం కూడలి వద్ద సుమారు రూ.4కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

బోట్ నడిపిన కలెక్టర్




కోరుట్ల: పట్టణంలోని మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను కలెక్టర్ యాస్మిన్‌భాషా, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రారంభించారు. అక్కడ ఏర్పాటుచేసిన బోట్‌ను ప్రారంభించి, మద్దుల చెరువులో కలెక్టర్ బోట్‌ను నడిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, అడిషనల్ కలెక్టర్ దివాకర, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే సంక్షేమ పథకాలు

- జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల కోసమేనని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి, అలాగే తిమ్మాపూర్ గ్రామంలో రూ.7.10 లక్షలతో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి, ఎస్సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలో రూ.1.60 లక్షలతో సీసీరోడ్డు, ఎస్సీ కమ్యునిటి హాల్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దావ వసంత

నిలిపారన్నారు. సర్పంచులు అంకం మమత, మేరుగు రమ్య, గంగాధర్, ఎంపీటీసీలు చిత్తారి స్వప్న, గిద్దె లక్ష్మి, నాయకులు జలేందర్, హరీశ్, సాగర్, రాజ్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే 'కాళేశ్వరం'

- రాష్ట్ర ప్రజలపై రూ.1.70వేల కోట్ల భారం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్



చెర్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

వెల్గటూర్: కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్‌తో కలిసి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. చెర్లపల్లి గ్రామానికి చెందిన 200మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీకి మిత్రపక్షంగా ఉంటూ కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే విషయాన్ని గాలికి వదిలేశారని అన్నారు. కాళేశ్వరం పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.1.70వేల కోట్ల ఆర్థిక భారాన్ని మోపారని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు అడ్డగోలుగా దోచుకుంటుంటే చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ 20ఏళ్లుగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ జంగల్‌నాలా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. కాళేశ్వరం లింక్–2కింద ఈ ప్రాంత రైతుల నుంచి 2వేల ఎకరాలు తీసుకుని అరకొర పరిహారం ఇచ్చినా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వెల్గటూర్ మండల అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, ఎంపీటీసీ మంజుల, తిరుపతి, ఎండపల్లి బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశం, అధికార ప్రతినిధి విజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కథలాపూర్: కథలాపూర్ మండలంలోని పలు చోట్ల రూ.13 కోట్లతో నిర్మించే రోడ్ల పనులకు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు శుక్రవారం భూమిపూజ చేశారు. మండలంలోని కథలాపూర్, భూషణ్‌రావుపేట, పోసానిపేట గ్రామాల రోడ్లకు రూ.13 కోట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్ల పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహరావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్‌లు సులోచన, గంగారెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన



శిబిరం వద్దే భోజనాలు చేస్తున్న ఆపరేటర్లు

జగిత్యాలటౌన్: సమస్యలు పరిష్కరించి పేస్కేలు అమలు చేయాలని ఈ పంచాయతీ ఆపరేటర్లు చేపట్టిన శాంతియుత సమ్మె 8వ రోజు కొనసాగింది. శుక్రవారం శిబిరం వద్ద వంటావార్పు చేసిన ఆపరేటర్లు అక్కడే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి, డీపీఎం సాంబశివ మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీ ఆపరేటర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. జిల్లాస్థాయిలో పనిచేస్తున్న ప్రాజెక్టు మేనేజర్లు, ఈ పంచాయతీ ఆపరేటర్లకు పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆరోగ్యబీమాతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకిస్తున్న అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గొట్టె రమేశ్, నాయకులు పల్లికొండ సంతోష్‌కుమార్, గంగమల్లు, వెంకటరమణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వద్ద బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విధులు నిర్వహించే కానిస్టేబుల్ గురువారం అర్ధరాత్రి గాంధీనగర్ సమీపంలో విధులు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన మహ్మద్ హఫీజ్, మహ్మద్ సబీర్, మహ్మద్ నదీమ్, మహ్మద్ హబీబ్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి, అతని విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

ధర్మారం: ఖిలావనపర్తి గ్రామానికి చెందిన మోతె కొండయ్య(70) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. కొండయ్య బుధవారం తన బర్రెలను మేత కోసం గ్రామ శివారులోని చెరువు వద్దకు తీసుకు వెళ్లాడు. అయితే రాత్రివరకు కొండయ్య ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కాగా, శుక్రవారం ఉదయం చెరువులో కొండయ్య శవమై నీటిపై తేలాడు. మృతుడి కుమారుడు మోతె కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మళ్లీ బూడిద వివాదం

- బయటపడిన కాంట్రాక్టర్ల మధ్య ఆధిపత్య పోరు
- లారీ రేటు విషయంలో కుదరని సయోధ్య
- వినియోగదారులపై రూ.15 కోట్ల భారమంటున్న ఒకవర్గం
- ప్రస్తుత ధర గిట్టుబాటు కాదంటున్న మరోవర్గం
- పోలీసుల వద్దకు పంచాయితీ, ఎన్టీపీసీకి ఫిర్యాదులు
- త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న కాంట్రాక్టర్లు



ఎన్టీపీసీ బూడిద చెరువు(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో నిర్మాణ రంగానికి కీలక ముడిసరుకుగా ఉన్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీ బూడిద(ఫ్లైయాష్) మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల టెండర్లు దక్కించుకున్న రెండువర్గాల మధ్య లారీ రేటు విషయంలో తలెత్తిన ఆధిపత్యపోరు చివరికి ఫ్లైయాష్ తరలింపు నిలిచిపోయే పరిస్థితికి కారణమవుతోంది. ఇటీవల ఏడాదికాలానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో రెండువర్గాలు ఉన్నాయి. ఎన్టీపీసీ నియమాల ప్రకారం.. బూడిదను కేవలం వినియోగదారులే తీసుకోవాలి. బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. తమకు ఎన్టీపీసీ నుంచి టన్ను రూ.40 చొప్పున వస్తున్నపుడు తాము ప్రతీ 25 టన్నుల లారీకి రూ.1100 (జీఎస్టీతో కలిపి), రూ.1,500 లోడింగ్, రూ.400 ఇతర చార్జీలు.. మొత్తం కలిపి లారీకి రూ.3,000 లోడింగ్, రవాణా, టోల్ చార్జీలు కలిపి మరో ప్రతీలారీపై తమకు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల సరఫరాకు ట్రిప్పుకు రూ.7,000 వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. అదే మరోవర్గం.. ఈ రేటుపై ససేమీరా అంటోంది, తమకు ఈ ధర గిట్టుబాటు కాదని సుమారు రూ.5,000 వరకు లోడింగ్ చార్జీలే అవుతాయని, మొత్తం లారీ మీద ఉమ్మడి జిల్లాలో రూ.10,000పైగా ఖర్చవుతోందని వాదిస్తోంది. అయితే, తమకు 50,000 ట్రిప్పులు (లారీ 25 టన్నులు) అవసరమవుతాయని.. ఆ ప్రకారం రూ.35 కోట్లు ఖర్చు అవుతుందని, అదే ట్రిప్పుకు రూ.10,000 చొప్పున ఖర్చయితే మొత్తం రూ.50 కోట్లు దాటుతోందని అంటున్నారు. అదనంగా

2021 సెప్టెంబరు ముందు ధరలు	
25 టన్నుల బూడిద లారీ రూ.700	
టన్ను బూడిద ధర రూ.23.30	
2022 సెప్టెంబరు తర్వాత ధరలు	
25 టన్నుల లారీ ధర రూ.12,000	
టన్ను బూడిద ధర రూ.400	
2023 ఆగస్టు తర్వాత ధరలు	
25 టన్నుల లారీ ధర రూ.10,000	
టన్ను బూడిద ధర రూ.40	

(నోట్: ఈ ప్రతిపాదిత ధరల విషయంలోనే వివాదం చెలరేగింది)

రూ.15 కోట్లకుపైగా భారం ఉమ్మడి జిల్లాలోని ఇటుక పరిశ్రమలు, నిర్మాణ రంగాలపై మీద పడుతోందని అంటున్నారు. ఈ బూడిద రాష్ట్రవ్యాప్తంగా సరఫరా అవుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ట్రిప్పుకు రూ.10వేలు అయితే, ఇతర జిల్లాలు.. హైదరాబాద్‌కు అంతకుమించి ఖర్చు అవుతోందని స్పష్టం చేస్తున్నారు.

పోలీసుల వద్దా కుదరని సయోధ్య

ఇరువర్గాల మధ్య నెలకొన్న పీఠముడి కాస్తా వెయ్యి ఎకరాల్లో విస్తరించిన బూడిద చెరువు నుంచి బూడిద తరలించకుండా నిలిచిపోయే పరిస్థితులు వచ్చాయి. దీంతో వివాదం పోలీసుల వరకూ వెళ్లింది. పోలీసులు ఎంత నచ్చజెప్పినా.. వీరిమధ్య సయోధ్య కుదరలేదు. అందులో ఒకవర్గం వారు మరోవర్గం వారిని అంతుచూస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై ఆందోళన చెందిన కొందరు కాంట్రాక్టర్లు.. అసలు అవతలి వర్గం.. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకుందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ యాజమాన్యానికి, రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనర్హతలతో ఎన్టీపీసీని తప్పుదోవ పట్టించి, తప్పుడు సమాచారంతో టెండర్లు దక్కించుకున్న వారిని తప్పించేలా త్వరలోనే హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు.

బూడిద నేపథ్యం..

రామగుండం ఎన్టీపీసీలో 2600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి రోజూ 32వేల టన్నుల బొగ్గు మండించగా, సుమారు 13వేల టన్నుల బూడిద (ఫ్లైయాష్), బాటం యాష్ రూపంలో వెలువడుతుంది. కొత్తలో ఈ బూడిదను ఎవరూ తీసుకునే వారు కాదు. పర్యావరణ సమస్యలూ తలెత్తాయి. దీంతో ఇటుకల తయారీలో ఫ్లైయాష్ వినియోగాన్ని కేంద్రం 2000 నుంచి తప్పనిసరి చేసింది. అలా ఇటుకల పరిశ్రమకు బూడిద ఉచితంగా ఇచ్చేవారు. దీనికి రోజురోజుకూ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో 2021 సెప్టెంబరులో ఎన్టీపీసీ టెండర్లు పిలిచింది. వేలానికి ముందు రూ.23గా ఉన్న టన్ను బూడిద.. వేలంలో అనూహ్యంగా రూ.400 చొప్పున కాంట్రాక్టర్లు కోట్‌చేసి ధరల పెరుగుదలకు కారణమయ్యారు. అప్పటివరకు 25 టన్నుల వరకు రూ.700గా ఉన్న లారీ రూ.12,000గా పలికింది. ఈ ప్రభావం ఇటుకల పరిశ్రమ, నిర్మాణ రంగంపై పడి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.30వేల భారం పడింది. ఈ విషయాన్ని గతేడాది 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. తాజా వేలంలో టన్ను బూడిద రూ.40 మాత్రమే పలికినా, ట్రిప్పు రేటు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం కొలిక్కి రావడం లేదు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- కిలో గంజాయి స్వాధీనం



విక్రేతల అరెస్టు చూపుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని జగిత్యాల రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్ వివరాల ప్రకారం.. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో రూరల్ ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అంబేద్కర్ పల్లెప్రకృతి వనం దగ్గర ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని తనిఖీ చేయగా, వారివద్ద కిలో గంజాయి లభ్యమైంది. జిల్లాకేంద్రంలోని చిలుకవాడకు చెందిన ఎండీ.ఇర్ఫాన్, మార్కండేయనగర్‌కు చెందిన గంజి సాయిరాం, మరో బాలుడు కలిసి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకుని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. గంజాయి రవాణా, అమ్మడం, సేవించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నార్కోటిక్‌డ్రగ్స్ చట్టం కింద శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. మైనర్‌లపై తల్లితండ్రులు దృష్టిసారించాలని, వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు నిఘా వేయాలని సూచించారు. ఈ సమావేశంలో రూరల్‌ఎస్సై సధాకర్, కానిస్టేబుల్ గంగాధర్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న భాసుస నేతలు

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లాకేంద్రంలో పాస్‌పోర్టు సేవాకేంద్రంతో పాటు బ్యాంక్ క్యాష్‌చెస్ట్ ఏర్పాటు చేయాలని భారత్ సురక్షా సమితి నేతలు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, జేఎన్టీయూ లాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాకేంద్రంలో పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ చెస్ట్‌ను కోరుట్లకు తరలించారని, పట్టణంలో జరిగే ఆర్థిక లావాదేవీలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకు చెస్టును తిరిగి జగిత్యాలలో ఏర్పాటు చేయాలని కోరారు. భారత్ సురక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్లు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, నరేందుల శ్రీనివాస్, బండారి మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

డబుల్ ఇళ్లలో గందరగోళం

- అనర్హులకు కేటాయించిన ఓ ఉద్యోగి
- తొలగింపునకు జేసీ ఆదేశం
- జాబితాను పునః విచారిస్తున్న అధికారులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 4,520 డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించింది. నూకపల్లి అర్బన్ కాలనీలో గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా నిర్మించారు. గతంలోనే డబుల్‌బెడ్‌రూంకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. జగిత్యాలకు చెందిన వారికి మాత్రమే అవకాశం కల్పించారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పూర్తిస్థాయిలో విచారించి అర్హులైన వారితోనే జాబితా రూపొందించారు. కాగా, హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం వల్ల గందరగోళం నెలకొంది. సారంగాపూర్, బీర్‌పూర్, మేడిపల్లి మండలాలకు చెందిన కొందరికి సైతం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయి. దీంతో ఇక్కడి వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారికి డబుల్‌బెడ్‌రూంలు వచ్చాయని, తమకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విచారించగా అందులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రెవెన్యూ అధికారులు పంపించిన జాబితాలోంచి అర్హులైన వారిని కొందరిని తొలగించి అనుకూలమైన వారిని చేర్చినట్లు తెలిసింది. దీంతో అదనపు కలెక్టర్ లత పూర్తిస్థాయిలో విచారించి ఉద్యోగి తొలగింపునకు ఆదేశించారు. మళ్లీ జాబితాను పునః సమీక్షిస్తున్నారు.

తొలగింపునకు ఆదేశించాం

హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి జాబితాలో అనర్హుల పేర్లు చేర్చడం జరిగింది. పూర్తిస్థాయిలో విచారించాం. తొలగింపునకు ఆదేశించాం. మళ్లీ పునః సమీక్షించి అర్హులందరికీ కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– లత, అదనపు కలెక్టర్

సాహితీవేత్త జగన్నాథం మృతి

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కథా రచయిత, రిటైర్డ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పంజాల జగన్నాథం శుక్రవారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆయన నివాసంలో మృతి చెందారు. జగన్నాథం మృతికి సాహితీగౌతమి బాధ్యులు నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్, తెరవే బాధ్యులు కందుకూరి అంజయ్య, సీవీ కుమార్, గాజోజు నాగభూషణం తదితరులు సంతాపం ప్రకటించారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

తిమ్మాపూర్: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నుస్తులాపూర్‌లో జరిగింది. ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మానసకు కొన్నేళ్ల క్రితం రఘుతో వివాహమైంది. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగింది. ఇటీవల భర్త వేధిస్తుండడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మానస పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు పెద్దమనుషుల సమక్షంలో ముంబైలో ఉంటున్న మానస తమ్ముడు వచ్చాకా మాట్లాడదామన్నారు. రఘు శుక్రవారం ఉదయం ఫోన్ చేసి వేధించాడు. మనస్తాపం చెందిన మానస ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మానస తండ్రి అలువాల మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించటమే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం లక్ష్యమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని మాదాపూర్ పాఠశాలలో శుక్రవారం ఉదయం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉదయం పూట ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తుంటారని, దీంతో చదువుపై శ్రద్ధ చూపడం కష్టమన్నారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ ద్వారా చక్కని పౌష్టికాహారం అందుతుందని, పాఠశాలల్లో డ్రాపౌట్‌లను కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆర్డీవో రాజేశ్వర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, తహసీల్దార్ కిషన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ గంగుల నరేశం పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా సీఎం కేసీఆర్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆడపడుచులకు అండగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని వేములకుర్తిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం ప్రారంభించి, ఆడపడుచులకు బతుకమ్మ చీరలు, యువకులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ కమటం భారతి, ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ ప్రసాద్, బీఆర్‌ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్, సర్పంచు సున్నం సవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంలో సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న పేరు లేకపోవడంతో అలిగి స్టేజీ పైకి రాలేదు. శిలాఫలకంపై తన పేరు ఎందుకు పెట్టలేదని అధికారులతో వాగ్వాదం చేశారు. శిలాఫలకంపై పేరు పెట్టిస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో స్టేజీ మీదకి వచ్చి కూర్చున్నారు.

పంట రుణమాఫీ వెంటనే చేయాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల పంట రుణమాఫీని వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కథలాపూర్ మండలం సిరికొండలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 2018 సంవత్సరంలో ఎన్నికల వేళ రైతులకు లక్ష రూపాయల పంట రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతుల ఓట్లతో ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తుందని మండిపడ్డారు. లక్ష రూపాయల పంట రుణాన్ని వెంటనే మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు బద్రి సత్యం, బండ అంజయ్య, పిడుగు ప్రతాప్‌రెడ్డి, జిల్లా సత్యం, దండిక లింగం పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఎవరిదో..?

- ఓటరు జాబితాలో నుంచి అక్రమంగా పేర్లు తొలగించారంటున్న కృష్ణ
- తహసీల్దార్‌కు ఫిర్యాదు



ఓటరు జాబితా చూపిస్తున్న గట్ల కృష్ణ

కథలాపూర్: ఓటరు జాబితా తయారు చేయడానికి గ్రామస్థాయి అధికారుల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు సుమారు 6 నెలలుగా కసరత్తు చేశారు. అయినప్పటికి ఓ కుటుంబంలో ఉన్న ముగ్గురి పేర్లను జాబితాలో నుంచి తొలగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన గట్ల కృష్ణ స్థానికంగా ఆర్‌ఎంపీ. ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలో గట్ల కృష్ణతోపాటు వారి కుటుంబసభ్యుల్లో ముగ్గురి పేర్లను తొలగించి ఉండటంతో అవాక్కయ్యాడు. స్థానికంగా అడిగితే సరైన సమాధానం రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కాగా భూషణరావుపేట ఓటరు జాబితాలో నుంచి తొలగించిన ముగ్గురి పేర్లు సిరికొండ గ్రామ ఓటరు జాబితాలో కనిపించినట్లు తెలిసింది. ఏదేమైనా ఏలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఓటరు జాబితాలో నుంచి పేర్లు తొలగించడం దారుణమని, జాబితా తయారీలో నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గట్ల కృష్ణ డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో దొర్లిన తప్పులను సవరిస్తామని కథలాపూర్ తహసీల్దార్ ముంతాజిబొద్దిన్ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న జ్యోతక్క

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికలో తగిన గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క పేర్కొన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత జిల్లా పర్యటనకు వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులను అరెస్ట్ చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండడం వల్లే ప్రతిపక్ష నాయకులు గొంతు ఎత్తకుండా ఉండడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మంత్రిగా వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన హరీశ్‌రావు దానిని విస్మరించి అభివృద్ధి పనుల పేరుతో పర్యటనలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా మంత్రి జ్వరాలపై దృష్టి సారించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు

- ఫలించిన పోరాటం
- నేటినుంచి తెరుచుకోనున్న కేంద్రాలు
- హర్షంవ్యక్తం చేస్తున్న సిబ్బంది



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): అంగన్‌వాడీల పోరాటం ఫలించింది. గత 24 రోజులుగా వారు చేస్తున్న సమ్మె సత్ఫలితాన్నిచ్చింది. రిటైర్మెంట్ బెనిఫిట్, వేసవి సెలవులు, కనీస వేతనం, ఇతర సౌకర్యాల కల్పనకు గత నెల 11న నిరవధిక సమ్మెకు దిగిన విషయం విదితమే. సమ్మె చేపట్టిన 24వ రోజున మంత్రి హరీశ్ రావు, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఏఐటీయూసీ, సీఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులను చర్చకు పిలిచారు. 5శాతం ఐఆర్, పీఆర్‌సీలో వేతన పెంపు, వేసవి సెలవుల వర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, పెండింగ్ ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లుల చెల్లింపులు తదితర డిమాండ్లు నెరవేరుస్తామని హామీఇచ్చారు. సమ్మెచేసిన రోజులకు వేతనాలు చెల్లిస్తామని అనడంతో సమ్మెను విరమించారు. దీంతో శుక్రవారం అంగన్‌వాడీలు, హెల్పర్లు ఆయా ప్రాజెక్టు కార్యాలయాల్లో వ్యక్తిగతంగా జాయిన్ రిపోర్టు చేసి విధుల్లో చేరారు. శనివారం నుంచి కేంద్రాలను తెరువనున్నారు. 24రోజులుగా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకుని, పోషకాహారం పంపిణీ చేయనుండటంతో లబ్ధిదారులు, చిన్నారులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1347 సెంటర్లు..

జిల్లాలో మెట్‌పల్లి, మల్యాల, జగిత్యాల, ధర్మపురిలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,347 అంగన్‌వాడీ కేంద్రాలు, 18 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,365 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలైతే వీరందరికి లబ్ధి చేకూరనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యను బోధించడంలోనూ ముందువరుసలో ఉంటున్నారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో అర్హుల ఎంపిక, ఓటర్ నమోదు, జ్వరం, కుటుంబ సర్వేలను కూడా ప్రభుత్వం వీరితో చేయిస్తోంది. స్థానిక సంస్థలతో పాటు అసెంబ్లీ సాధారణ ఎన్నికల సమయంలో కూడా సేవలు అందిస్తున్నారు. ఇతర ఉద్యోగుల కన్నా తమతో ఎక్కువ పనిచేయించుకుంటున్న ప్రభుత్వం తమకు కష్టానికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఇంతకాలం వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మెచేశారు. ప్రభుత్వం వారి డిమాండ్లు నెరవేర్చేందుకు సానుకూలత వ్యక్తం చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషకరం



ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం సంతోషంగా ఉంది. పనికి తగిన వేతనం చెల్లించాలని 24 రోజులు సమ్మె చేసిన ఫలితంగా ప్రభుత్వం చర్చలకు పిలిచి సానుకూలత వ్యక్తం చేయడం సంతోషంగా ఉంది.

– మోతె శారద, దీకొండ, అంగన్‌వాడీల యూనియన్ లీడర్

ఐక్య పోరాటంతోనే



సమ్మెతో ప్రభుత్వం స్పందించింది. మా సమస్యలను పరిష్కరించి మరికొన్నింటికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. టీచర్లు, హెల్పర్లు అందరం కలిసి ఐక్యంగా పోరాటం చేశాం. హామీలు నెరవేర్చకపోతే మళ్లీ పోరు బాట పడతాం.

– రజిత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు